క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే లక్ష్యం

కూర్మన్నపాలెం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో ఆదివారం మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి స్పోర్ట్స్ కాంప్లెక్సుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలాన్ని వెంటనే చదును చేయించి స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే రూ.6 కోట్లతో నిర్మించనున్న కాలువలకు పల్లా శంకుస్థాపన చేశారు. మూడు ప్రాంతాల్లో కాలువలకు ఇరువైపులా రిటైనింగ్‌వాల్ నిర్మిస్తామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు బొండా జగన్, గంధం శ్రీను, ముత్యాలనాయుడు, పల్లా శ్రీను, జోనల్ కమిషనర్ శేషు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



సోమనాథ్ రక్షిత్ (ఫైల్)

అగనంపూడి: నంద్యాలలో రైలు ఎక్కిన తమ కుమారుడు దువ్వాడ రైల్వేస్టేషన్ వచ్చిన తర్వాత అదృశ్యమైనట్టు పశ్చిమ బెంగాల్ హైరా ప్రాంతానికి చెందిన ప్రతాప్ రక్షిత్ దువ్వాడ జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశా రు. పశ్చిమ బెంగాల్ హైరాకు చెందిన సోమనాథ్ రక్షిత్ (39) నంద్యాలకు పనిమీద వెళ్లారు. ఈనెల 12న తిరుగు ప్రయాణంలో నంద్యాలలో రైలు ఎక్కారని పేర్కొన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న తర్వాత వీడియో కాల్‌చేశాడని.. తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో పాటు ఇంటికి చేరలేదని ఫిర్యాదు చేశారు. జీఆర్‌పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి మాట్లాడుతూ రక్షిత్ పసుపు రంగు షర్ట్, నీలంరంగు జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 73820 58996 నంబర్‌కు తెలియజేయాలని ఆమె కోరారు.

గణపతి నమూనా ఆవిష్కరణ

గాజువాక: ఈ ఏడాది వినాయకచవితికి స్థానిక లంకా మైదానంలో ఏర్పాటు చేయనున్న భారీ గణపతి నమూనాను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. లక్ష చీరలతో వినాయకుని విగ్రహం రూపు దిద్దుకుంటోందని, ఈసారి గణపతికి సుందర వస్త్ర గణపతిగా నామకరణం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చట్టి గోపి, తుంపాల చిరంజీవి, చింతపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక: జీవీఎంసీ 66వ వార్డు అజీమాబాద్‌లోని సున్నీ జామియా మసీదు ఆవరణలోని కబరస్తాన్‌కు ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 లక్షలతో ఈ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, స్థానిక నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, నజీర్, దుబాయ్ బాషా, షౌకత్ అలీ, గోమాడ వాసు, ప్రసాదుల శ్రీనివాస్, గంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాట్యారాధన చిన్నారులకు అభినందన



ప్రతిభచూపిన చిన్నారికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ: జాతీయ స్థాయి నవరస శాస్త్రీయ, జానపద సంగీత నృత్య కళారూపాల పోటీల్లో వుడా కాలనీకి చెందిన నాట్యారాధన ఆర్ట్స్ అకాడమీకి బహుమతులు లభించాయి. చిలకలూరిపేటలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో అకాడమీకి చెందిన 11 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంతో పాటు పలు బహుమతులు సాధించారు. ఈ మేరకు అకాడమీలో ఆదివారం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ విజేతలను అభినందించారు. వారి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

ఫుట్‌పాట్లు



వందడుగుల రోడ్‌లో ఫుట్‌పాత్‌పై నిలిపిన కార్లు



గాజువాక మెయిన్ రోడ్‌లో పరిస్థితి

- జనం రోడ్లపై.. కార్లు ఫుట్‌పాత్‌లపై
- వ్యాపార కేంద్రాలుగా కాలిబాటలు

పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. జనం నడవడం కోసం లక్షలు ఖర్చు చేసిన నిర్మించిన కాలిబాటలు కార్ల పార్కింగ్‌లకు, వ్యాపారుల కార్యకలాపాలకు ఉపయోగపడుతున్నాయి. ఫలితంగా వాటి లక్ష్యం కొరగాకుండా పోయింది. ప్రజలు ప్రమాదాలకు ఎదురొడ్డి రాకపోకలు సాగిస్తున్నారు. చినగంట్యాడ వందడుగుల రోడ్, వుడా డబుల్ రోడ్, కణితి రోడ్‌కు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను కొంత మంది ఆక్రమించి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న దుకాణదారులు ఫుట్‌పాత్‌లపైనే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కొంతమంది టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తుండగా, మరికొంతమంది మెకానిక్ సెంటర్లను ఏర్పాటు చేసుకొన్నారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌లపై ఏకంగా కార్లను పార్క్ చేసి ఉంచుతున్నారు. కొత్తగాజువాక నుంచి పాతగాజువాక వరకు ఉన్న మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్‌లు వ్యాపారాలకు ఉపయోగపడుతున్నాయి. ఇక్కడ ఫుట్‌పాత్‌లు రెడీమేడ్ వ్యాపారులు, చెప్పుల దుకాణాలు, పండ్ల వ్యాపారాలకు వేదికయ్యాయి. ఇక వంటిల్లు జంక్షన్ నుంచి గోపాలరెడ్డినగర్ వరకు, జగ్గు జంక్షన్ నుంచి గాజువాక మార్కెట్ వరకు, పాతగాజువాక నుంచి వంటిల్లు జంక్షన్ వరకు గల రోడ్ మార్జిన్‌లో లెక్కలేనన్ని ఫుట్‌పాత్ దుకాణాలు కొత్తగా పుట్టుకొచ్చాయి.

– గాజువాక



పెదగంట్యాడ ఏరియాలో ఫుట్‌పాత్‌పై చిరు దుకాణం



వుడా రోడ్‌లో ఫుట్‌పాత్‌పై వస్త్ర దుకాణం

టీడీపీలో వర్గ విభేదాలు

86వ వార్డులో రచ్చకెక్కిన అసంతృప్తి



వర్గ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు టీడీపీలో వర్గవిభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. అక్కడ నాయకులు వర్గాలుగా విడిపోయి ఎవరి కార్యక్రమాలు వారు చేసుకుంటున్నారు. ఇటీవల నియమించిన వార్డు కమిటీల్లో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు చోటు దక్కలేదని రగలిపోతున్నారు. దీనిలో భాగంగా ఆదివారం జాతీయ రహదారి పక్కన గల ఓ కల్యాణమండపంలో కొత్త కమిటీకి వ్యతిరేకంగా అసంతృప్తి నాయకులు సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ ఎంపిక తీరును ఎండగట్టారు. ఆ సమావేశం కూడా స్థానిక శాసనసభ్యుడు, పార్టీ అధ్యక్షుడైన పల్లా శ్రీనివాసరావు 87వ వార్డులోని సభలో మాట్లాడుతున్న సమయంలో ఇక్కడ నిర్వహించడం గమనార్హం. పార్టీ కోసం పనిచేస్తున్న వారిని పక్కన పెట్టి విశాఖ ఉక్కులో పదవీ విరమణ చేసిన వారిని వార్డు కమిటీకి అధ్యక్ష, కార్యదర్శులుగా నియమించారని మండిపడ్డారు. ఇటీవల ఎమ్మెల్యే పల్లా వార్డులో పర్యటించిన సందర్భంలో కూడా రెండు వర్గాల మధ్య స్వల్పంగా ఘర్షణ జరిగినట్టు తెలుస్తోంది. కొత్తగా కమిటీని రద్దు చేసి వార్డులోని కార్యకర్తల అభీష్టం మేరకు కమిటీ వేయాలని ఆ వర్గం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సమావేశంలో కె.ఈశ్వరరావు, బొడ్డార మణ, రాజానాయుడు.కుమార్,శ్రీను, జాగారపు లక్ష్మి జయలక్ష్మి తమ వ్యతిరేకతను వెల్లడించారు. కాగా కొత్త కమిటీ నాయకులు కూడా ఎవరినీ లెక్క చేయడంలేదు. దీంతో వార్డులో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు తికమక పడుతున్నారు.

మొక్కల పెంపకం అవశ్యం



మొక్క నాటుతున్న కార్పొరేటర్ లేళ్ల

కూర్మన్నపాలెం: పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాజీవ్‌నగర్ ఫేజ్1లో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం కలుషితం కాకుండా చూసుకుంటూ మొక్కలు నాటడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోషియేషన్ పెద్దలు సుబ్బరాజు, సాయిరామరాజు, మూర్తి సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి కిక్ బాక్సింగ్ పోటీలు



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: ఈ నెల 27న విశాఖలో నిర్వహించనున్న 10వ గ్రేటర్ విశాఖ డిస్ట్రిక్ట్ కిక్‌బాక్సింగ్ చాపియన్‌షిప్ ట్రోఫీని కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు అక్టోబర్‌లో అస్సాంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. కాగా, ఇటీవల ఆంధ్రప్రదేశ్ నుంచి రిఫరీలుగా, జడ్జిలుగా ఎంపికైన పలువురికి టీ షర్టులను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ల ప్రతినిధులు గంట నూకరాజు, డి.ప్రేమ్‌కుమార్, ఎస్.సతీష్, వర్మ, కె.రాజు, ప్రసాద్, కె.సుధాకర్, కరణం సన్ని తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు విశిష్టతపై అవగాహన



చేతులకున్న గోరింటాకు చూపుతున్న ఫౌండేషన్ మహిళా విభాగం సభ్యులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆషాఢమాసంలో గోరింటాకు విశిష్టతపై ఫౌండేషన్ సభ్యులు విస్తృత ప్రచారం నిర్వహించారు. కూర్మన్నపాలెంలో ఎంవీఆర్ అపార్ట్‌మెంట్‌లో వేంకటేశ్వర దేవాలయం కేంద్రంగా ఫౌండేషన్ మహిళా విభాగం సభ్యులు గోరింటాకు విశిష్టతపై ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి మాట్లాడుతూ దేవాలయం కేంద్రంగా భజన, సత్సంగం, పౌర్ణమికి సామూహిక హారతి, ఆత్మీయ బంధువులను కలవడం వంటి విషయాలను తెలియజేశారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్.కుమారి, ఎం.సుశీల, ఎన్.లక్ష్మి, పి.రామచంద్రరావు, పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గాజువాక: కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా గాజువాక మహిళా రైతు బజార్‌లో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై అధిక భారం పడే స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.వనజాక్షి, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, పిల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

తాటిచెట్లపాలెం: బ్రహ్మకుమారీస్ రైల్వే న్యూకాలనీ శాఖ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ సమీపంలోఆదివారం బ్రహ్మకుమారీలు, రోటరీ బ్లడ్ సెంటర్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురు వ్యక్తుల ప్రాణాలు కాపాడవచ్చన్నారు. బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధి శశికళ, రోటరీ బ్లడ్ సెంటర్ చైర్మన్ కె.వి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.మురళీధర్, డాక్టర్ అశోక్, సిబ్బంది, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సందడిగా స్టీల్‌క్లబ్ వార్షికోత్సవం



వేడుకల్లో ఢీ ఫేమ్ పండు నృత్య ప్రదర్శన

ఉక్కునగరం: స్టీల్‌క్లబ్ వార్షికోత్సవాలు సందడిగా జరిగాయి. 22వ వార్షికోత్సవం సందర్భంగా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాకారులు తమ ప్రావీణ్యంతో అలరించారు. ఢీ జోడీ ఫేమ్ పండు, గుణశ్రీలు వివిధ సినీ గీతాలకు చేసిన డ్యాన్స్ ఆహుతులను ఆకట్టుకుంది. బాలు రైడర్స్ డ్యాన్స్ గ్రూప్ వైవిధ్యమైన డ్యాన్స్‌లతో అలరించారు. జబర్దస్త్ ఫేమ్ నూకరాజు, గెడ్డం మురళీ బృందం స్కిట్లు, పంచులతో నవ్వించారు. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి, క్లబ్ అధ్యక్షుడు ఎం. మధుసూదనరావు , స్టీల్‌ప్లాంట్ జీఎం డాక్టర్ వి. చిట్టిబాబు, క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి వై. రవికుమార్, కార్యవర్గ సభ్యులు కె.ఎల్. నరసింహం, కృష్ణయ్య, ఎ. రమేష్, జె. రమేష్, భువన్ కిరణ్, వి.ఎస్.వి. రాజు, రంగనాథ్ పాల్గొన్నారు.



స్కిట్ ప్రదర్శిస్తున్న జబర్దస్త్ కళాకారులు

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

‘సాహిత్యం’ అందజేత



రిటైర్డ్ ఉద్యోగికి పుస్తకాలు, చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గౌతమ బుద్ధుడి సాహిత్యం అందజేశారు. అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం(సీఈడి) సీనియర్ మేనేజర్ ఆర్.టి.ఆర్. అంబేడ్కర్, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ సంఘ కార్యాలయానికి అంబేడ్కర్, బుద్ధుడి సాహిత్యం అందజేయడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ విరమణ చేసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ పథకం (ఆర్‌బీఎస్) చెక్కులు అందజేశారు. ఎస్.ఎం.ఎస్ ఈఎం కుమారస్వామి, డబ్ల్యూ.ఆర్.ఎం అధికారి మురళీకృష్ణలు తమకు ఇచ్చిన నగదును అసోసియేషన్ షెడ్డు కోసం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్. సత్యనారాయణ, కె.వి. రత్నం, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

129 మందికి కంటి వైద్య పరీక్షలు



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్, శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పినమడక, డొంకాడ, కొత్తూరు, పూడివానిపాలెం కాలనీలకు చెందిన 129 మంది శిబిరంలో పాల్గొన్నారు. నేత్ర పరీక్షల అనంతరం 24 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరందరికీ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయడం జరుగుతుందని అమ్మా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొంపా వెంకటరావు, శంకర్ ఫౌండేషన్ వైద్యుడు దీపక్ చెప్పారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దేశేంద్ర, నాయకుడు ఇల్లపు ప్రసాద్ ,క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మానందం, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఎస్.అర్జున్, గొల్లవిల్లి నూకరాజు, గంతకోరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న అండిబోయిన లక్ష్మి

పెదగంట్యాడ: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు.. వారిలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు పోటీలు దోహదం చేస్తాయని హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి అన్నారు. అంతర్జాతీయ చదరంగం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో చాంపియన్స్ అకాడమీ కోచ్ పట్నాల శివ ఆధ్వర్యంలో ఆదివారం చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ఆమె మాట్లాడారు. చదరంగం క్రీడ అంటే మెదడుకు పదును పెట్టాలన్నారు. ఈ క్రీడలో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అండిబోయిన అప్పారావు, శ్రీను, రాము, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీఎస్ ఫౌండేషన్ సభ్యులు

పెదగంట్యాడ: టీడీఎస్ ఫౌండేషన్ ఓ బాధితుడికి సాయం అందజేసి ఉదారత చాటుకుంది. జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీకి చెందిన శివకుమార్ అనే యువకుడు చెరుకు రసం బండిని నిర్వహిస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. చెరుకు రసం తీస్తుండగా ఈ నెల 6న చేయి మిషన్‌లోకి వెళ్లిపోవడంతో నుజ్జయింది. వెంటనే ఆ యువకుడిని కేజీహెచ్‌కు తరలించి చికిత్స చేయించారు. డిశ్చార్జి అయి ఇంటికి వచ్చిన అతడిని టీడీఎస్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. రూ.11,500 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఢిల్లీ సనపల, అనిల్, శ్రీను, కార్తీక్, యశ్వంత్, హరీష్, జ్యోతి, సురేష్, సంతోష్, మహేష్, దుర్గా ప్రసాద్, త్రినాథ్, రాజ్‌కుమార్, దిలీప్, సాయి పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛాంధ్ర!



మండలంలో అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పరిహాసంగా మారింది. కూటమి ప్రభుత్వంలో ఫొటోలకు మాత్రమే స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నారు తప్పా.. క్షేత్ర స్థాయిలో ఇసుమంతైనా మార్పులేదు. పారిశుధ్య పనులు సరిగ్గా చేయకపోవడంతో వార్డులన్నీ మురుగుకూపాలుగా మారిపోతున్నాయి. 76వ వార్డు నడుపూరు. 73వ వార్డు చిననడుపూరు, 75వ సీతానగరం ఏడుగుళ్లు సమీపంలో, 74వ వార్డు దయాల్ నగర్ భక్తాంజనేయ ఆలయం ఎదురుగా, 65వ వార్డు వికాషనగర్ ఐటీఐ రోడ్డులో, 64వ వార్డు గంగవరంలో ఇలా ప్రతీ వార్డులో ప్రధాన రహదారులు, వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో దోమలకు ఆవాసాలుగా మారి.. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనికి కారణం పారిశుధ్య లోపమేనని ప్రజలు వాపోతున్నారు. అధికారులు దృష్టి సారించి చెత్తకుప్పలు ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

– పెదగంట్యాడ



